# యాత్ర కాదు.. చరిత్ర చూడు

## ‘పాలమూరు-రంగారెడ్డి’ 70 ఏండ్ల తండ్లాటకు కారణమే కాంగ్రెస్.. బీఆర్‌ఎస్ మేడిగడ్డ యాత్ర నుంచి దృష్టి మరల్చేందుకే పాలమూరు యాత్ర

కృష్ణమ్మ 300 కి.మీ. పారుతున్నా పాలమూరు బీడు ఎందుకాయె?

పడావు పడిన పాలమూరుకు జలాభిషేకం చేసి సస్యశ్యామలం చేసింది కేసీఆరే

కల్వకుర్తి-నెట్టెంపాడుకు పట్టిన దశాబ్దాల గ్రహణం కాంగ్రెస్ పాపమే

పెండింగ్ ప్రాజెక్టులకు రెండేండ్లలోనే మోక్షం కల్పించిన కేసీఆర్


జిల్లాలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు ఎవరి పుణ్యం

నీటి వాటాల కోసం కేంద్రంతో కొట్లాడి, సుప్రీంలో పోరాడింది ఎవరు?

వదిలి ఇతర ప్రాజెక్టులను చేపడుతున్నది ఎవరు?

### ఈ ప్రశ్నలకు కాంగ్రెస్ సమాధానం చెప్పగలదా?

*కృష్ణాజలాల్లో హక్కులను కాలరాసి, ప్రాజెక్టులను పండబెట్టి.. పెండింగ్ ప్రాజెక్టులుగా ముద్రవేసి.. పాలమూరును నిలువునా ముంచి జిల్లాను వలసలబాట పట్టించిన కాంగ్రెస్ నేడు తగుదునమ్మా అంటూ నిస్సిగ్గగా పాలమూరు యాత్ర అంటూ బయలుదేరుతున్నది. పాలమూరుకు అన్యాయం జరిగిపోయిందంటూ గొంతు చించుకున్న కాంగ్రెస్ గతంలో చేసిందేమిటో ఈ ప్రత్యేక కథనంలో చూద్దాం.*



మ్యాకం రవికుమార్/హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): తవ్వేచూడాలే కానీ కాంగ్రెస్ పాపాలు అన్నీ ఇన్నీ కావు. ఏమూల వెతికినా పాపాల పుట్టలు కుప్పలుకుప్పలుగా కనిపిస్తాయి. రాజకీయ ప్రయోజనాల కోసం అన్ని రంగాలను భ్రష్టుపట్టించిన కాంగ్రెస్ చరిత్రను వెలికితీస్తే అది కొండవీటి చాంతాడు కంటే పెద్దగానే ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణను దారుణంగా దెబ్బతీసిన నాటి పాలకులు పాలమూరును వలసల జిల్లాగా మార్చారు. ఆ గాయాల నుంచి జిల్లా ఇప్పుడిప్పుడే బయటపడుతున్న వేళ గాయాన్ని మళ్లీ కెలుకుతున్నారు. నిజానికి తెలంగాణలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాది ప్రత్యేక స్థానం. దాదాపు 300 కిలోమీటర్ల మేర కృష్ణమ్మ బిరబిరా పరుగులెడుతున్నా గొంతు తడిపేందుకు చుక్కనీరు లేక, పొలాలకు జీవం నింపే సాగునీరు లేక దశాబ్దాలపాటు అల్లాడిపోయింది. జిల్లాలో దాదాపు 35లక్షల ఎకరాలకుపైగా సాగుకు యోగ్యమైన భూములున్నాయి. అప్పర్ కృష్ణా, తుంగభద్ర ప్రాజెక్టుల ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో దాదాపు 7 లక్షలకుపైగా ఎకరాలకు సాగునీటిని అందించేందుకు నిజాం ప్రణాళికలను రూపొందించినా, కాంగ్రెస్ పాప ఫలితంగా జిల్లా మొత్తం పడావు పడింది.

#### దశాబ్దాలుగా పెండింగ్ ప్రాజెక్టులే

కాంగ్రెస్ పాపాల్లో మొట్టమొదట కనిపించేది కల్వకుర్తి-నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం. ప్రాజెక్టు సర్వే కోసం 1984లో జీవో జారీచేస్తే 1999లో పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. 2003లో టెండర్ల ప్రక్రియ పూర్తయింది. అంటే జీవో జారీ అయిన 20 ఏండ్లకు పనులు ప్రారంభించారు. ఆ తర్వాత పదేండ్లకు కూడా పనులు పూర్తికాలేదు. నిధుల కొరత, భూసేకరణ, అంతర్రాష్ట్ర వివాదాలు.. ఇలా పలు సాకులతో ప్రాజెక్టును అటకెక్కించేశారు. ఉమ్మడి పాలనలో తెలంగాణ దుస్థితి ఇది.

#### ఇది కదా.. కేసీఆర్ దీక్ష

తెలంగాణ ఏర్పాటు తర్వాత అనేక సవాళ్ల మధ్య సీఎం అయిన కేసీఆర్ తొలుత దృష్టిపెట్టింది పాలమూరుపైనే. బీడుభూముల్లో నీళ్లు పారించాలన్న లక్ష్యంతో అటకెక్కిన ప్రాజెక్టుల దుమ్ము దులిపారు. ఇంజినీరింగ్ నిపుణులతో సమీక్షించి సమస్యలు పరిష్కరించారు. క్షేత్రస్థాయిలో తిరుగుతూ పనులను నిరంతర పర్యవేక్షణతో, ప్రాధాన్యత క్రమంలో నిధులను సమకూర్చుతూ, అవసరమైన అనుమతులను సత్వరమే జారీచేస్తూ పెండింగ్ ప్రాజెక్టుల పనులను పరుగులు పెట్టించారు. కేవలం రెండేళ్లలోనే మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టు పనులను 50 శాతం నుంచి 95 శాతానికి పూర్తిచేశారంటే కేసీఆర్ అకుంఠిత దీక్ష ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. 2016-17లో కల్వకుర్తి ద్వారా 1.6 లక్షల ఎకరాలు, నెట్టెంపాడు ద్వారా 1.2 లక్షల, భీమా ద్వారా 1.4 లక్షల ఎకరాలు, కోయిల్‌సాగర్ ద్వారా 8 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు.. మొత్తంగా నాలుగు ఎత్తిపోతల పథకాల ద్వారా 5 లక్షల ఎకరాలకు తొలిసారిగా సాగునీటిని అందించిన ఘనత కేసీఆర్‌దే. క్రమంగా డిస్ట్రిబ్యూటరీల పనులను పూర్తి చేశారు. నేడు ప్రాజెక్టుల కింద నికరంగా 10 లక్షలకు పైగా ఎకరాలకు సాగునీరు అందుతున్నది.



**ప్రధాన ప్రాజెక్టుల వారీగా నీటి వినియోగం**

| ప్రాజెక్టు | కేటాయింపులు 2013-14నాటికి | ప్రస్తుతం సగటు వినియోగం |
|---|---|---|
| జూరాల | 17.84 | 15.9 |
| కోయిల్‌సాగర్ | 3.9 | 2.8 |
| రాజీవ్‌భీమా | 20 | 0.5 |
| ఆర్డీఎస్ | 15.90 | 5.6 |
| నెట్టెంపాడు | 22(ఫ్లడ్) | 0 |
| కల్వకుర్తి | 25(ఫ్లడ్) | 0 |
| మొత్తం | 104.64 టీఎంసీలు | 24.8 టీఎంసీలు |

#### కేసీఆర్ ఉక్కు సంకల్పం

కృష్ణా జలాల్లో న్యాయమైన నీటి వాటా కోసం తెలంగాణ ఉద్యమంలో నాటి ఉద్యమనేతగా, తొమ్మిదిన్నరేండ్లు ముఖ్యమంత్రిగా కేసీఆర్ తన గళాన్ని బలంగా వినిపించారు. ఎవరెన్ని అడ్డంకులు కల్పించినా, అడ్డుకోవాలని చూసినా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును దృఢసంకల్పంతో ముందుకు తీసుకెళ్లారు. ఉమ్మడి పాలకులు 8.8లక్షల ఎకరాలతో జూరాల నుంచి ప్రతిపాదించిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తిగా ఇంజినీరింగ్ నిపుణులతో కలిసి అధ్యయనం చేయించారు. ప్రాజెక్టు ప్రతిపాదిత ఆయకట్టును 12.30లక్షలకు పెంచడంతో పాటు, ఇన్‌టేక్ పాయింట్‌ను జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు మార్చి వెంటనే పరిపాలన అనుమతులను మంజూరు చేశారు. 2015లోనే ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేయడం విశేషం. పోలవరం డైవర్షన్ ద్వారా అందుబాటులోకి వచ్చే 45టీఎంసీలను, మైనర్ ఇరిగేషన్ కింద ట్రిబ్యునల్ కేటాయించిన 89 టీఎంసీల్లో వినియోగించకుండా ఉన్న 45 టీఎంసీలను మొత్తం 90టీఎంసీల నికర జలాలను కేటాయించడం విశేషం. ఆ వెంటనే ప్రాజెక్టు డీపీఆర్‌ను సిద్ధం చేసి కేంద్ర పర్యావరణ శాఖకు సమర్పించడమే కాదు, అనుమతుల సాధనే లక్ష్యంగా ఢిల్లీలో ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేసి సిబ్బందిని సైతం నియమించడం కేసీఆర్ ప్రభుత్వ చిత్తశుద్ధికి, పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తుంది. కేంద్రం ఎన్ని అడ్డంకులు సృష్టించిన ఎట్టకేలకు పర్యావరణ అనుమతులకు సంబంధించి ఈఏసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర పర్యావరణశాఖకు సిఫారసు చేసింది. ఇప్పటికీ 4 నెలలు గడచినా అది అక్కడే పెండింగ్‌లో ఉన్నది. దానిపైనా ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ఒక్కసారి కూడా దృష్టి సారించకపోవడం గమనార్హం.

**ప్రాజెక్టులతో అనుసంధానించిన చెరువులు**

| ప్రాజెక్టు | చెరువులు | ఆయకట్టు |
|---|---|---|
| కల్వకుర్తి | 589 | 51257 |
| రాజీవ్‌భీమా | 247 | 15560 |
| నెట్టెంపాడు | 98 | 5480 |
| జూరాల | 62 | 4346 |
| కోయిల్‌సాగర్ | 52 | 4920 |

#### కాలువలు తవ్వితే చాలు

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు రంగారెడ్డి జిల్లాలో 12.30లక్షల ఎకరాలకు సాగునీటితోపాటు, తాగునీటిని అందించాలనే లక్ష్యంతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి (పీఆర్‌ఎల్‌ఐఎస్) రూ.35వేల కోట్ల అంచనా వ్యయంతో 2015లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మొదటిదశలో చేపట్టిన తాగునీటి సరఫరాకు సంబంధించిన పనులను నాగర్‌కర్నూలు జిల్లా శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి ప్రాజెక్టు పనులను మొత్తంగా 21 ప్యాకేజీలుగా విభజించగా, కేపీ లక్ష్మీదేవిపల్లి మినహా ప్రస్తుతం 18 ప్యాకేజీల పనులను మాత్రమే ప్రభుత్వం చేపట్టింది. ప్రస్తుతం ఆయా ప్యాకేజీల పనులన్నీ దాదాపు తుదిదశకు చేరుకున్నాయి. రిజర్వాయర్లన్నీ పూర్తయ్యాయి. వాటి నుంచి కాలువలను తవ్వితే చాలు ప్రాజెక్టు ద్వారా 16 నియోజకవర్గాల్లో 70 మండలాల్లో 1226 గ్రామాలకు తాగునీరు, 12.30లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. కానీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పనులను ఎక్కడికక్కడ నిలిపేసింది. రాజకీయకక్షతో, సొంత ఇమేజ్ కోసం పాలమూరు కాలువ పనులను వదిలి ఇతర ప్రాజెక్టులను చేపడుతున్నది.

#### జీవోలు ఇచ్చేందుకూ అడ్డంకులే

2005లో పాలమూరు-రంగారెడ్డి పథకానికి రిటైర్డ్ ఇంజినీర్ల ఫోరం రూపకల్పన చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ప్రాజెక్టు సర్వే పనులకు జీవో ఇవ్వడానికి సైతం అనేక అడ్డంకులను సృష్టించింది. రాష్ట్రం ఏర్పాటు అయ్యేంతవరకూ ఆ పనులు ముందుకు సాగకుండా నాటి కాంగ్రెస్ ప్రభుత్వమే అడుగడుగునా అడ్డుకుంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా పాలమూరును నట్టేట ముంచేందుకు కాంగ్రెస్ చేయని యత్నమంటూ లేదు. తెలంగాణ ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులు చేపట్టగానే అడ్డుకునే ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రాజెక్టుపై దాదాపు 40కి పైగా కేసులను ఇటు సుప్రీంకోర్టులో, అటు ఎన్జీటీలో వేయించింది. మరోవైపు రైతులను పక్కదోవ పట్టిస్తూ, ప్రభుత్వంపైకి ఎగదోస్తూ ప్రాజెక్టు నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ ముందుకు సాగకుండా అడుగడుగునా అడ్డుకునేందుకు విఫలయత్నాలు చేసింది. తెలంగాణ ఉద్యమ ధాటికి, బీఆర్‌ఎస్ ఒత్తిడితో ఎట్టకేలకు అయిష్టంగానే 2013లో ప్రాజెక్టుకు ఆమోదం తెలుపుతూ జీవోను జారీ చేసింది.

**పాలమూరు ప్రాజెక్టుల రిజర్వాయర్లు**

- **అంజనగిరి (నార్లాపూర్)**
  కట్ట మొత్తం పొడవు: 11.02కి.మీ.
  ఎత్తు: 74మీటర్లు
  నీటి నిల్వ సామర్థ్యం: 8.41టీఎంసీలు.
  ఎఫ్‌ఆర్‌ఎల్: 345
- **వీరాంజనేయ (ఏదుల)**
  కట్ట మొత్తం పొడవు: 12.40 కి.మీ.
  ఎత్తు: 38మీటర్లు
  నీటి నిల్వ సామర్థ్యం: 6.55 టీఎంసీలు
  ఎఫ్‌ఆర్‌ఎల్: 445
- **వెంకటాద్రి (వట్టెం)**
  కట్ట మొత్తం పొడవు: 15.23 కి.మీ.
  ఎత్తు: 57మీటర్లు.
  నీటి నిల్వ సామర్థ్యం: 16.74 టీఎంసీలు
  ఎఫ్‌ఆర్‌ఎల్: 542
- **కురుమూర్తిరాయ (కరివెన)**
  కట్ట మొత్తం పొడవు: 14.12 కి.మీ.
  ఎత్తు: 61మీటర్లు.
  నీటి నిల్వ సామర్థ్యం: 17.34టీఎంసీలు
  ఎఫ్‌ఆర్‌ఎల్: 531
- **ఉద్దండాపూర్**
  కట్ట మొత్తం పొడవు: 15.87 కి.మీ.
  ఎత్తు: 57.99 మీటర్లు.
  నీటి నిల్వ సామర్థ్యం: 16.03టీఎంసీలు.
  ఎఫ్‌ఆర్‌ఎల్: 629మీటర్లు (రాష్ట్రంలో ఇప్పటివరకు ఇదే అత్యధిక ఎత్తులో ఉన్న రిజర్వాయర్)

**కృష్ణా బేసిన్‌లో మహబూబ్‌నగర్‌కు సంబంధించిన లిఫ్ట్‌ల వివరాలు**

| లిఫ్ట్ | రోజుకు నీటిని ఎత్తిపోసే సామర్థ్యం | పంపులు | ఒక్కో పంపు సామర్థ్యం |
|---|---|---|---|
| జూరాల | 4055 క్యూసెక్కులు (గ్రావిటీ) | | |
| నెట్టెంపాడు | 3000 క్యూసెక్కులు | 4 | 17 మెగావాట్లు |
| రాజీవ్ భీమా | 1950 క్యూసెక్కులు | 3 | 12 మెగావాట్లు |
| కోయిల్‌సాగర్ లిఫ్ట్ | 630 క్యూసెక్కులు | 2 | 7.5 మెగావాట్లు |
| కల్వకుర్తి | 3200 క్యూసెక్కులు | 5 | 30 మెగావాట్లు |
| మొత్తం | 12835 క్యూసెక్కులు (ఒక టీఎంసీ) | | |
| ★ పాలమూరు-రంగారెడ్డి | 24000 క్యూసెక్కులు | 8+1 | 145 మెగావాట్లు |

★ నోట్: తెలంగాణ ఏర్పాటు నాటికి జూరాల మినహా మరే ప్రాజెక్టు కూడా ప్రారంభం కాలేదు.

#### ఒక్క పాలమూరుతోనే 67.97టీఎంసీల నిల్వ

ఉమ్మడి రాష్ట్రంలో నాటి పాలకులు ఏపీలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకున్నారే తప్ప, తెలంగాణ భూభాగంలో ఎక్కడా నీటి నిల్వను పట్టించుకోలేదు. ఉమ్మడి ఏపీలో భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల నిల్వసామర్థ్యం మొత్తంగా 1232 టీఎంసీలుంటే అందులో ఏపీకి 827 టీఎంసీలు, తెలంగాణలో 302 టీఎంసీలు ఉండడం తెలంగాణపై నాటి పాలకులకు ఉన్న ప్రేమకు నిదర్శనం. భౌగోళిక, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నీటి నిల్వ సామర్థ్యం ఎక్కువగా తెలంగాణలోనే ఉండాలి. కానీ దాన్ని సీమాంధ్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు. అందుకు కృష్ణా నదిపై ఉన్న జూరాల ప్రాజెక్టే ఉదాహరణ. రాష్ట్ర ఏర్పాటు నాటికి కృష్ణా బేసిన్‌లో మొత్తం తెలంగాణ నీటి నిల్వ సామర్థ్యం 8టీఎంసీలు కాగా, ప్రస్తుతం నిర్మిస్తున్న ఒక్క పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతోనే 67.97 టీఎంసీల నిల్వసామర్థ్యం పెరుగుతుండడం విశేషం. నికరంగా కృష్ణా బేసిన్‌లో నీటి నిల్వ సామర్థ్యం 75.94టీఎంసీలకు పెరగనుంది. ఇవిగాకుండా ఇప్పటికే చెక్‌డ్యామ్‌లు, చెరువుల పునరుద్ధరణతోనూ కృష్ణా బేసిన్‌లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించారు.



*గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి*

## పాలమూరుపై రివ్యూకు సిద్ధమా?

- ప్రాజెక్టు ఆలస్యానికి కాంగ్రెస్సే కారణం
- బీఆర్‌ఎస్ హయాంలో 90% పూర్తి
- తెలంగాణ తెచ్చుకున్నది ప్రాజెక్టుల పనులు ఆపడానికి కాదు
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- కాంగ్రెస్ నేతలు డ్రామాలాడొద్దు : మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): పాలమూరు ప్రాజెక్టుల దగ్గర సీఎం సమీక్ష నిర్వహిస్తే రావడానికి తాము సిద్ధంగా ఉన్నామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టంచేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు 90% పూర్తయ్యాయని, మిగిలినవి పూర్తిచేయాలని సూచించారు. తెలంగాణ తెచ్చుకున్నది ప్రాజెక్టుల పనులు నిలిపి వేయడానికి కాదని హెచ్చరించారు. గురువారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టి, పాలమూరు జిల్లాను వెనుబడేసిన కాంగ్రెస్ నేతలు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు యాత్రకు పోవడం విడ్డూరంగా ఉన్నదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలోనే పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులు రన్నింగ్ ప్రాజెక్టులుగా మారాయని గుర్తుచేశారు. పాలమూరులో ఐదు రిజర్వాయర్లు కేసీఆర్ హయాంలోనే నిర్మించారని, మిగతావి కాంగ్రెస్ పూర్తి చేయాలని సూచించారు. పాలమూరులో పోటీ యాత్రలు కాదని, తమతో పోటీ పడి పనిచేయాలని చురకలేశారు. మేడిగడ్డకు మరమ్మతులు చేయలేక, పాలమూరు ప్రాజెక్టుల దగ్గరికి కాంగ్రెస్ నేతలు వెళ్తున్నారని విమర్శించారు. కేసీఆర్ పాలనలో పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేశారు కనుకే పంట విస్తీర్ణం పెరిగిందని స్పష్టంచేశారు. కృష్ణా ప్రాజెక్టులు కేఆర్‌ఎంబీ పరిధిలోకి వెళ్లకుండా కాంగ్రెస్ నేతలు దృష్టి పెట్టాలని, బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు మన నీటి వాటా కోసం గట్టిగా కొట్లాడాలని సూచించారు.

**పాలమూరు ప్రజలతో ఆటలొద్దు**

పాలమూరు జిల్లా ప్రజలతో ఆటలాడొద్దని మాజీ మంత్రి సీ లక్ష్మారెడ్డి కాంగ్రెస్ నేతలను హెచ్చరించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయడానికి సందర్శిస్తున్నారా? లేక పోటీ యాత్రనా? చెప్పాలని డిమాండ్ చేశారు. తాము నల్లగొండ సభ పెడితే కాంగ్రెస్ మేడిగడ్డ పోయిందని, ఇప్పుడు తాము మేడిగడ్డకు అంటే పాలమూరు-రంగారెడ్డి అంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వాన్ని నడిపే పద్ధతి ఇదేనా? అని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం 90% పూర్తి చేసిందని, మిగిలినవి పూర్తిచేయాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు కేసులు వేయడం వల్లనే ప్రాజెక్టు ఆలస్యమైందని చెప్పారు. కాంగ్రెస్ నిర్వాకం వల్లనే పాలమూరు జిల్లా వెనకబడిందని మండిపడ్డారు. పాలమూరు వలసలకు కాంగ్రెస్ కారణమని, డ్రామాలు చేయొద్దని, డ్రామాలు మానుకోవాలని సూచించారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రాజెక్టులకు అన్యాయం జరిగిందని, దృష్టంతా ఆంధ్రా ప్రాజెక్టులపైనే ఉండేదని ఆరోపించారు. కేసీఆర్ సీఎం అయ్యాకే తెలంగాణ ప్రాజెక్టులకు మోక్షం లభించిందని చెప్పారు. కేసీఆర్‌ను బద్నాం చేయడానికే కాంగ్రెస్ ప్రాధాన్యమిస్తున్నదని పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌తో తెలంగాణకు తీరని నష్టం

- *నాడు చట్టం చేసిందే కాంగ్రెస్*
- *నేడు కేంద్ర సర్కారుపై నెట్టే కుట్ర*
- *ఏడాదిలోగా ట్రిబ్యునల్ విచారణ పూర్తిచేసేలా చర్యలు*
- *ప్రమాదపుటంచున శ్రీశైలం, సాగర్*
- *మేడిగడ్డ వివరాలు ఎన్‌డీఎస్‌ఏకు ఇవ్వకుండా కాలయాపన*
- *ప్రాజెక్టులపై అనుమానాలు వద్దు*
- *కేంద్రజల్‌శక్తిశాఖ సలహాదారు, ఐఆర్‌ఎల్‌పీ టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ వెదిరె శ్రీరాం*



వెదిరె శ్రీరాం

*హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే నదీజలాల్లో తెలంగాణకు తీరని నష్టం వాటిల్లిందని, న్యాయమైన నీటి వాటా కేటాయింపులు చేయలేదని, ప్రాజెక్టులను రివర్ బోర్డులకు అప్పగించాలని చట్టం చేసిందే నాటి యూపీఏ సర్కార్ అని కేంద్రజల్‌శక్తిశాఖ మంత్రి సలహాదారు, ఐఆర్‌ఎల్‌పీ టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ వెదిరె శ్రీరాం పేర్కొన్నారు. నాడు అనాలోచితంగా చట్టం చేసి నేడు ఆ తప్పిదాలను కేంద్ర సర్కారుపై నెట్టే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. నగరంలోని కవాడిగూడ సీజీవో టవర్స్‌లో కేంద్ర జల్‌శక్తిశాఖ తరపున గురువారం మధ్యాహ్నం ఆయన మీడియాతో మాట్లాడారు. గోదావరి నదిపై ఉన్న పలు ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ, నూతన మార్గదర్శకాలు, మేడిగడ్డ బరాజ్ ఘటన, కేఆర్‌ఎంబీ జ్యూరిస్‌డిక్షన్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు, దేవాదుల ప్రాజెక్టులను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన విధానాన్ని తప్పుబట్టారు. మేడిగడ్డ బరాజ్ కుంగిన వెంటనే కేంద్రం స్పందించి ఎన్‌డీఎస్‌ఏ బృందాన్ని తెలంగాణకు పంపిందని గుర్తుచేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని నివేదికలు, ఇన్వెస్టిగేషన్ రిపోర్టులు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచించిందని వెల్లడించారు. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తి నివేదికలు ఇవ్వవడం లేదని, ఎన్‌డీఎస్‌ఏకు సహకరించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ తీరుతో ఇప్పటికే 4 నెలల సమయం వృథా అయినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక కమిటీ వారం రోజుల్లో పునరుద్ధరణ చర్యలపై నెల రోజుల్లో సిఫార్సు చేస్తుందని పేర్కొన్నారు.*

#### ప్రాజెక్టుల స్వాధీనం అందుకే

*ఉమ్మడి ప్రాజెక్టుల నిర్వహణను రివర్ మేనేజ్‌మెంట్ బోర్డులకు అప్పగించాలని ఏపీ పునర్విభజన చట్టం-2014లో అప్పటి యూపీఏ ప్రభుత్వం పేర్కొన్నదని, దాని ప్రకారమే ప్రాజెక్టులను ఇప్పుడు కేఆర్‌ఎంబీ స్వాధీనం చేసుకున్నదని తెలిపారు. నీటి కేటాయింపులు లేకుండానే ప్రాజెక్టులను నిర్మించుకోవచ్చని రాష్ట్రాలకు చెప్పిందని, విద్యుత్తు ప్రాజెక్టులను ఒక చోట, రివర్ బోర్డులు మరోచోట రాష్ట్రాలే నిర్వహించుకుంటాయని అసంబద్ధంగా, అస్పష్టతతో చట్టాన్ని రూపొందించిందని దుయ్యబట్టారు. నీటి వాటాలను న్యాయంగా పంపిణీ చేసేలా ట్రిబ్యునల్ 2కు మార్గదర్శకాలు జారీచేయలేదని మండిపడ్డారు. నేటి జల వివాదాలకు నాటి కాంగ్రెస్ తప్పిదాలే కారణమన్నారు.*

**ప్రమాదకరంగా శ్రీశైలం**

*శ్రీశైలం ప్రాజెక్టు పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉన్నదని శ్రీరాం ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ప్రాజెక్టును సందర్శించిన ఎన్‌డీఎస్‌ఏ వెంటనే మరమ్మతులు చేయాలని సూచించిందని గుర్తుచేశారు. ఇటీవల ఎన్‌డీఎస్‌ఏ బృందం ప్రాజెక్టును సందర్శించిందని పేర్కొన్నారు. ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, నిర్వహణను పట్టించుకోవడం లేదని విమర్శించారు. నాగార్జునసాగర్ నిర్వహణను తెలంగాణ ప్రభుత్వం బాగానే చేసిందని, ఏపీ ఆక్రమణ తర్వాత కుడివైపున మరమ్మతులకు అక్కడి ప్రభుత్వం అంగీకరించకపోవడంతో నిర్వహణ కష్టంగా మారిందని వివరించారు. కేఆర్‌ఎంబీని, కేంద్రాన్ని, సీడబ్ల్యూసీని నిందించడం తగదని ఇరు రాష్ట్రాలకు హితవు పలికారు.*



*గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్. చిత్రంలో పార్టీ నేతలు బసవరాజు సారయ్య, దేవీ ప్రసాద్*

## కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్ర

- ప్రపంచానికి వివరిస్తాం: మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్
- కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెప్తారు: బసవరాజు సారయ్య, దేవీప్రసాద్

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్ర చేస్తున్నదని, దీనిని ప్రపంచానికి తెలిపేందుకే తాము మేడిగడ్డకు వెళ్తున్నామని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. నీటిపారుదల ప్రాజెక్టులను నిర్వీర్యం చేయాలన్న ఆలోచనతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని ఆయన అనుమానం వ్యక్తంచేశారు. ప్రభుత్వ కుట్రను, దుష్ప్రచారాన్ని తిప్పికొడతామని తెలిపారు. ప్రాజెక్టుల్లో జరిగిన ప్రతి పనిలోనూ అవినీతి అంటూ రాష్ట్రాన్ని అధోగతి పాల్జేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. అతిపెద్ద అవినీతి జరిగిందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఎలా చెప్తారని, ఆయన విచారణాధికారా? అని ప్రశ్నించారు. లక్ష కోట్లు ఖర్చు కానీ కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతి ఎలా జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. న్యాయ విచారణకు ఆదేశించినట్టు సీఎం చెప్పారని, విచారణలో తేలాల్సిన విషయాలను మంత్రి ఉత్తమ్ ఎలా చెప్తారని ప్రశ్నించారు. మేడిగడ్డ పిల్లర్లను మరమ్మతు చేసి నీళ్లు ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అభివృద్ధి యాత్రలు చేయాలి కానీ, తమకు పోటీ యాత్రలు కాదని హితవు పలికారు. ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య మాట్లాడుతూ పేద విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు వెంటనే ఉపకార వేతనాలకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు అధికార దర్పంతో వ్యవహరిస్తున్నారని, కాళేశ్వరం ప్రాజెక్టు విఫలమైందని చూపే ప్రయత్నం, కుట్ర తగదని, ప్రజలు తగిన బుద్ధిచెప్తారని హెచ్చరించారు.

## పాలమూరు పాలిట శిఖండి కాంగ్రెస్

**ఏ ముఖం పెట్టుకుని సందర్శనకు వస్తున్నారు?**

- ముక్కు నేలకు రాసి జిల్లాలో అడుగుపెట్టాలి
- పాలమూరు-రంగారెడ్డి యాత్ర ఝూటా యాత్ర
- ప్రాజెక్టుపై ఒక్కసారైనా సమీక్షించారా?
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం



హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సందర్శన ఒక ఝూటా యాత్ర అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలమూరు ప్రాజెక్టుల్లో కాంగ్రెస్‌ది శిఖండి పాత్ర అని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు ఏ ముఖం పెట్టుకొని పాలమూరు-రంగారెడ్డి సందర్శనకు వస్తున్నారని నిలదీశారు. పాలమూరు వలసలు, రైతులు, కూలీల చావులకు కారణమైన కాంగ్రెస్ నేతలు ముక్కు నేలకు రాసి జిల్లాలో అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు. ‘వందల కేసులు వేసి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల నిర్మాణంలో జాప్యానికి కారణమైంది కాంగ్రెస్ నేతలు కాదా? ప్రాజెక్టుల నుంచి పూర్తిస్థాయిలో సాగునీళ్లు ఇవ్వకుండా కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా నష్టపోయేందుకు కారణమైంది కాంగ్రెస్ కాదా?’ అని నిలదీశారు. కేఆర్‌ఎంబీకి కృష్ణా ప్రాజెక్టులను తాకట్టుపెట్టి దక్షిణ తెలంగాణకు తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. ‘పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయహోదా గురించి కాంగ్రెస్ ఎన్నడైనా అడిగిందా? అధికారంలోకి వచ్చి మూ డు నెలలవుతున్నా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై ఎందుకు సమీక్షించలేదు? ఇప్పటికే 90 శాతం పూర్తయిన ప్రాజెక్టు పనులను కొనసాగించకుండా దాదాపు రూ.7 వేల కోట్ల టెం డర్లు ఎందుకు రద్దు చేశారు? ఆదరాబాదరాగా నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టడం ఎవరి ప్రయోజనం కోసం?’ అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు విఫలయత్నం అని చెప్పేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు.

**అపర భగీరథుడు కేసీఆర్**

బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ సభ పెడితే కాంగ్రెసోళ్లు మేడిగడ్డ సందర్శన చేపట్టారని, ఇప్పుడు బీఆర్‌ఎస్ మేడిగడ్డ సందర్శన అంటే పాలమూరు సందర్శనకు బయలుదేరుతున్నారని నిరంజన్‌రెడ్డి దుయ్యబట్టారు. హరిహరబ్రహ్మాదులు అడ్డొచ్చినా పాలమూరును ఆపలేరని సవాల్ చేసి, పాలమూరు కలను నిజం చేసిన భగీరథుడు కేసీఆర్ అని కొనియాడారు. ఎన్నో చిక్కుముడులను విప్పి, కోర్టుల్లో స్టేలను ఎత్తేయించి అనుమతులు సాధించింది కేసీఆర్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి వేలాది చెరువులను మత్తళ్లు పోయించామని తెలిపారు. పాలమూరులో బంగారు పంటల దృశ్యాలను చూపించింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ప్రజలకు కావాల్సింది పోటీ యాత్రలు కాదని, రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీని దమ్ముంటే పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదాపై నిలదీయాలని సవాల్ చేశారు.